సాక్షి
అనకాపల్లి
సోమవారం । 30 । జూన్ । 2025





**'బాట'లు మరిచారు!**
ఎన్నికల్లో గెలిస్తే జీఎన్ రోడ్డును బాగు చేస్తామన్న కూటమి నేతలు ఇప్పుడు కనీసం గోతులను కూడా పూడ్చడం లేదు. 8లో



**మార్మోగిన హరినామస్మరణ**
కొమ్మాది: వారాంతపు పూజల సందర్భంగా సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరినామస్మరణ మార్మోగింది.



**వైభవం.. వరదపాయస సేవ**
సింహగిరిపై వైకుంఠవాసుడి సన్నిధిలో ఆదివారం వరదపాయసం సేవ విశేషంగా నిర్వహించారు. 8లో

## న్యూస్‌రీల్

### పరిహారాన్ని నగదు రూపంలో ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న నిర్వాసితుల సంఘం ప్రతినిధులు

**అచ్యుతాపురం:** అచ్యుతాపురం–అనకాపల్లి రోడ్డు విస్తరణ బాధితులకు నగదు రూపంలో పరిహారాన్ని ఇవ్వాలని, టీడీఆర్‌ల రూపంలో వద్దని రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం అచ్యుతాపురంలో వారు నిర్వాసితుల తరపున నిరసన వ్యక్తం చేసి, నినాదాలు చేశారు. రోడ్డు విస్తరణలో కోల్పోతున్న భూములు, ఇళ్లు, దుకాణాలకు తక్కువ మార్కెట్ ధర చూపిస్తున్నారని, ఇది అన్యాయమన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మాజీ, కర్రి అప్పారావు, రామ సదాశివరావు, ఎస్.కనుమనాయుడు, బుద్ధ రంగారావు పాల్గొన్నారు.

### టార్గెట్లు పూర్తి చేయడం మా వల్ల కాదు

- గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగుల ఆవేదన



ఉపమాకలో సమావేశమైన జీడిఎస్ ఉద్యోగులు

**నక్కపల్లి:** పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నామని,నెలవారీ టార్గెట్లు పూర్తిచేయడం మా వల్లకాదంటూ గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. యలమంచిలి సబ్ డివిజన్ పరిధిలో పలు గ్రామాల్లో పనిచేస్తున్న జీడీఎస్‌లు ఆదివారం ఉపమాకలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఎస్‌బీ అకౌంట్లు, ఐపీపీబీ అకౌంట్లు,టీడీ పాలసీలు సుకన్యయోజన పథకం టార్గెట్లు ఇచ్చిన సకాలంలో పూర్తిచేయలంటూ ఒత్తిడి చేయడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈసమావేశంలో జీడీఎస్ ఉద్యోగుల డివిజన్ కార్యదర్శి డి.ఎస్.ఆర్. ప్రసాద్,మాజీ కార్యదర్శి కె. మనోహర్, సంఘనాయకులు విశ్వేశ్వరరావు, సీహెచ్ భద్రం, దయానంద్,బి.వి.రమణ,నాగేంద్రరావు, సత్యానారాయణమూర్తి పాల్గొన్నారు.

### బొప్పాయి తోట నేలమట్టం



నేలమట్టమైన బొప్పాయి చెట్లు

**అచ్యుతాపురం రూరల్ :** వేకువజామున వీచిన ఈదురుగాలులకు రామన్నపాలెంలో బొప్పాయి తోట నేలమట్టమైంది. ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున గాలులు వీయడంతో ధర్మిరెడ్డి నర్సింగరావుకు చెందిన ఎకరా బొప్పాయి తోటలో చెట్లు కూలిపోయాయి. సుమారు రూ.50 వేలు నష్టం వచ్చిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

**అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు**
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ 8లో

# ప్రకృతి సేద్యం.. లాభసాటి వ్యవసాయం



పీఎండీఎఫ్ విధానంలో మొలకెత్తిన వివిధ రకాల విత్తనాలు

- 'బీజామృతం'తో విత్తనశుద్ధి
- ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ సాగుతో నేల సారవంతం
- రైతుకు అధిక దిగుబడి.. వినియోగదారులకు ఆరోగ్యం
- సేంద్రియ వ్యవసాయం పెంపునకు అధికారుల ప్రయత్నం




**జిల్లాలో ప్రకృతి వ్యవసాయం**
గతేడాది సాగు చేసిన రైతుల సంఖ్య 32,374
ఈ ఏడాది లక్ష్యం 47,108
గతేడాది సాగు విస్తీర్ణం 35,590 ఎకరాలు
ఈ ఏడాది లక్ష్యం 52,004 ఎకరాలు

**సాక్షి, అనకాపల్లి:** రసాయనాలు విరివిగా వాడటంతో భూసారం క్షీణించడం.. పంటల దిగుబడి తగ్గిపోవడం.. రైతు నష్టాలపాలై దిగులు చెందడం కనిపిస్తోంది. ఇది వినియోగదారుల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో రైతులు ముందుగానే చీడపీడల నుంచి తమ పంటను కాపాడుకునే విధంగా వారిని ప్రకృతి సేద్యం వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతోంది. ఈమేరకు ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసే విధానం, విత్తనశుద్ధి గురించి వివరిస్తున్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడని పంట విత్తనాలు, దేశవాళీ విత్తనాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 24 మండలాల్లో 165 గ్రామ పంచాయతీల్లో సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం విస్తృతం చేస్తున్నారు.

**బీజామృతంతో ఎంతో మేలు**

ప్రకృతి వ్యవసాయంలో విత్తనాల ఎంపిక ఎంతో ముఖ్యమైన ప్రక్రియ. దేశవాళీ విత్తనాలను సేకరించి, వాటిని శుద్ధి చేసి విత్తుకున్నప్పుడే చీడపీడల బెడద లేకుండా పంట దిగుబడి బాగుంటుంది. తెగుళ్ల బెడద నుంచి పంటను రక్షించుకునేందుకు విత్తే సమయంలోనే బీజామృతంతో శుద్ధి చేసుకోవాలి. భూమి నుంచి సంక్రమించే తెగుళ్లను నిరోధించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఆవు మూత్రం,



ఎస్.బి.పట్నంలో బీజామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

పేడ, పొడి సున్నం, పొలం గట్టు మీద మట్టి లేదా దోసెడు పుట్టమన్నుతో బీజామృతాన్ని తయారు చేస్తారు. విత్తనాలను ప్లాస్టిక్ కాగితంపై పోసి తగినంత బీజామృతం పోసి కలపాలి. విత్తనాలకు బీజామృతం బాగా పట్టిన తర్వాత కొద్దిసేపు నీడన ఆరబెట్టుకొని విత్తుకోవచ్చు. నారును, మొక్కలను కూడా బీజామృతంలో ముంచి నాటుకోవచ్చు.

**ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ సాగు**

ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానంలో తొలకరి చినుకులు పడక ముందే సాగు ప్రక్రియను ప్రారంభిస్తారు. వివిధ రకాల పంటలను (నవధాన్యాలు, ఇతర విత్తనాలు) కలిపి విత్తుతారు. పచ్చిరొట్ట, ధాన్యపుజాతి, పప్పుజాతి, నూనెజాతి, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతి ఇలా 30 రకాల విత్తనాలు వేయడం ద్వారా భూమి సారవంతంగా తయారవుతుంది. ఈ పీఎండీఎస్ అవశేషాలను భూమిలో కలియదున్నడం వల్ల రసాయనిక ఎరువులైన డీఏపీలో ఉన్న అన్ని రకాల పోషకాలు అందుతాయి. దీని ద్వారా వానపాములు అభివృద్ధి చెంది భూమి గుల్లబారుతోంది. ప్రకృతి వ్యవసాయంలో పండించే ధాన్యంతో భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉంటాయి. జిల్లాలో 52 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. ఇప్పటికే 47 వేల ఎకరాల వరకు చేశారు. ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో పీఎండీఎస్ పూర్తికానుంది.

**సేంద్రియ పద్ధతిపై అవగాహన**

జిల్లాలో సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడంపై ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ అధికారులు నెల రోజులుగా అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో వివిధ పంటల సాగు ఎక్కువగా నాతవరం మండలంలోని చిన గొలగొండపేట, పెద గొలుగొండపేట, ఎస్.బి.పట్నం, పి.కొత్తగూడెం, సరుగుడు, సుందరకోట, కె.వి.శరభవరం గ్రామాల్లో జరుగుతుంది. గొలుగొండ, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం, దేవరాపల్లి, చీడికాడ, కోటవురట్ల, పాయకరావుపేట, అనకాపల్లి, కశింకోట మండలాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు.

**సేంద్రియ పద్ధతితో అందరికీ మేలు**

సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం వల్ల వినియోగదారుల ఆరోగ్యానికి మంచి జరుగుతుంది. ఎరువులు, పురుగు మందులు వేసి పండించే పంటల కారణంగా క్యాన్సర్‌కు గురవుతున్నారు. ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయ సాగు పెంచాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎఫ్ (ప్రీ మాన్‌సూన్ సోయింగ్) విత్తనాలతో మొదటి దశ ప్రారంభించాం. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసే ముందు భూమి ఎండిపోకుండా, భూసారం పెరిగేలా నవధాన్యాలను విత్తుతారు. దీంతో రైతుకు లాభసాటిగా వ్యవసాయం ఉంటుంది. ఈ ఏడాదిలో ప్రకృతి వ్యవసాయం విస్తృతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

– లచ్చన్న, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి

## విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ గడువు నేటితో పూర్తి

**కశింకోట:** గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు విద్యుత్ లోడ్‌ను దాదాపు సగం రాయితీతో క్రమబద్ధీకరించుకోవడానికి ఇచ్చిన గడువు సోమవారంతో ముగియనుందని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. కిలో వాట్ లోడ్‌కు రూ.2,250 చార్జీ కాగా, రూ.1,250 చెల్లిస్తే సరిపోతుందన్నారు. రెండు కిలో వాట్ల కు రూ.4,450 చార్జీ కాగా రూ.2450, 3 కిలో వాట్లకు 6,650కిగాను రూ.3650, నాలుగు కిలో వాట్లకు రూ.8,850కి గాను రూ.4,850, ఐదు కిలో వాట్లకు రూ.11,050కు గాను రూ. 6,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరణ కోసం విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోను, మీ–సేవా కేంద్రాలు, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ www.apeasterpower.comలో దరఖాస్తు చేసుకొని నిర్దేశిత రుసుం చెల్లించాలన్నారు. అనకాపల్లి, కశింకోట, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చురుగ్గా రైల్వే జోన్ పనులు



పొక్లెయిన్‌తో పనులు చేస్తున్న సిబ్బంది

**ఆరిలోవ(విశాఖ):** ముడసర్లోవ వద్ద నిర్వహిస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ముడసర్లోవ ప్రాంతంలో విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా రైల్వే జోన్ కోసం 52 ఎకరాల భూమిని కేటాయించిన విషయం తెలిసిందే. దీనిలో సుమారు ఆరు నెలల కిందట ల్యాండ్ టెస్టింగ్ పనులు చేపట్టడంతో పనులు ప్రారంభించారు. నెల రోజులుగా పూర్తిస్థాయి పనులు జరుపుతున్నారు. ప్రస్తుతం 14 ఎకరాల్లో విశాలమైన 12 అంతస్తుల భవనం నిర్మాణం పనులు చేపట్టారు. అండర్ గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లు, పైన 10 ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. వర్షా కాలంలో పనులకు ఎలాంటి ఆటంకంగా రాకుండా ముందు జాగ్రత్తగా ఇసుక తీసుకొచ్చి నిల్వ ఉంచారు. రైల్వే జోన్ రీజనల్ మేనేజర్ కార్యాలయంతోపాటు ఉన్నతాధికారుల క్వార్టర్స్ అన్నీ ఇక్కడే నిర్మిస్తున్నారు.

## మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు అదనంగా భూములివ్వం



నెల్లిపూడిలో సమావేశమైన రైతులు



డీఎల్‌పురంలో నిరసన తెలుపుతున్న రైతులు

- క్యాప్టివ్‌పోర్టుతోమత్స్యకారుల మనుగడ ప్రశ్నార్థకం
- అఖిల పక్ష సమావేశంలో రైతులు స్పష్టీకరణ

**నక్కపల్లి:** ఆర్సిలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ఏపీఐఐసీ చేస్తున్న అదనపు భూసేకరణతో రైతులకు తీరని నష్టం కలుగుతుందని, వ్యవసాయ రంగంపై ఆధారపడిన ఇతర వృత్తుల వారు జీవనోపాధి కోల్పోతారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నెల్లిపూడిలో రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతు నాయకులు గింజాల రమణ, అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ ఇప్పటికే నక్కపల్లి మండలంలో రైతుల నుంచి ఐదు వేల ఎకరాలకు పైగా భూములు సేకరించి బల్క్ డ్రగ్‌పార్క్, స్టీల్‌ప్లాంట్‌లకు కేటాయించారని, స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ కోసం నెల్లిపూడి, వేంపాడు, డీఎల్ పురం, కాగిత గ్రామాల్లో మరో 3,265 ఎకరాలు సేకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం సేకరించే భూముల్లో మామిడి, జీడి, కొబ్బరి పంటలు పండే భూములు ఉన్నాయని, ఈ భూముల్లో ఉన్న తోటల వల్ల రైతులు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఉద్యాన వన పంటలు ఎక్కువగా పండే భూములను లాక్కోడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. మత్స్యకారులు ఎనిమిది గ్రామాల్లో నివసిస్తున్నారని ప్రమాదకర రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేసి, వారి జీవనోపాధి దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో జాతీయ రహదారికి తీరప్రాంతానికి మధ్యలో ఉన్న భూములన్నింటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోను మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం అదనంగా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. అదేవిధంగా క్యాప్టివ్ పోర్టును మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించడాన్ని కూడా వారు తప్పుపట్టారు. పోర్టు నిర్మిస్తే మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతారన్నారు. క్యాప్టివ్‌పోర్టు స్టీల్‌ప్లాంట్ ఆధీనంలో ఉంటే మత్స్యకారులు వేటలేక మనుగడ ప్రశ్నార్థకమవుతుందని చెప్పారు. అదనపు భూసేకరణను అడ్డుకుని తీరుతామన్నారు. రైతుల ఆమోదం లేకుండా అదనంగా సేకరించే భూముల కోసం సర్వే చేస్తున్నారని, ఈ సర్వేని అడ్డుకుని తీరుతామని తెలిపారు. ఈ సమావేశంలో రైతులు అవతారం రాజు,తాతరాజు, సూరిబాబు,చినతాతలు తదితరులు పాల్గొన్నారు. డీఎల్ పురంలో కూడా రైతులు నిరసన తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో మహిళా ఉద్యోగులకు రక్షణ కరవు

- కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై దురుసుగా ప్రవర్తించిన చోడవరం ఎమ్మెల్యే, కూటమి నేతలపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

**అనకాపల్లి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మహిళా ఉద్యోగులకు రక్షణ కరవైందని, కూటమి నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణను చోడవరం ఎమ్మెల్యే, కూటమి నేతలు దూషించి, ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సుమారు నాలుగున్నర గంటల పాటు నిలుచోబెట్టడం అన్యాయమన్నారు. అనకాపల్లి పట్టణంలో శారదాకాలనీలో అన్నపూర్ణ స్వగృహానికి అమర్‌నాథ్, పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కరణం ధర్మశ్రీ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆదివారం వెళ్లి, పరామర్శించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. అన్నపూర్ణ కశింకోట మండలం తేగాడగ్రామం కేజీబీవీలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సమయంలో పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించారని, ఆమెను అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సత్కరించిందన్నారు. 2022లో సాధారణ బదిలీల్లో వడ్డాది కేజీబీవీకి ఆమె వెళ్లారని, చోడవరం నియోజకవర్గంలో కూటమి నాయకుల్లో అంతర్గత కుమ్ములాటల కారణంగా ప్రిన్సిపాల్‌ను వేధించడం అన్యాయమన్నారు. ప్రిన్సిపాల్‌ను వేధించిన ఎమ్మెల్యే, కూటమి నాయకులపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ యోగాంధ్ర సందర్భంగా చోడవరం ఎమ్మెల్యే... బుచ్చెయ్యపేట ఎంపీడీవోను మానసికంగా వేధించడంతో తీవ్ర అనారోగ్యానికి గురై మరణించారన్నారు. వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణను కూటమి నేతలు వేధించడం అన్యాయమని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. చోడవరంలో కూటమి నేతలు కుమ్ములాట వల్ల వేరు కుంపట్లుగా ఏర్పడ్డారని, ఆధిపత్యంకోసం అక్కడ ప్రభుత్వ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌ను చోడవరం ఎమ్మెల్యే కార్యాలయానికి పిలిపించుకుని, మానసికంగా వేధించడం అన్యాయమన్నారు. ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులపై కూటమి నేతలు అరాచకాలు పెరిగిపోయాయన్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తే, కూటమి నేతలు ఆమెపై దురుసుగా ప్రవర్తించడం తగదన్నారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత మాట్లాడుతూ చోడవరం ఎమ్మెల్యే... మహిళా ప్రిన్సిపాల్‌ను దూషించడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు పెద్దపీట వేస్తే, కూటమి పాలనలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు వేగి త్రినాథ్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు గైపూర్ రాజు, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ నేతలు బొడ్డేడ శివ, దొడ్డి హరిబాబు, మునూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ అన్నపూర్ణను పరామర్శిస్తున్న గుడివాడ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ, మలసాల భరత్‌కుమార్

# ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పడిగాపులు

- సాయంత్రం వరకు ప్రారంభంకాని బదిలీల కౌన్సెలింగ్
- భారీగా సిఫార్సు లేఖలు.. పైరవీలకే పెద్దపీట

**మహారాణిపేట(విశాఖ) :** బదిలీల కౌన్సెలింగ్ కోసం ఆదివారం ఉదయాన్నే జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సాయంత్రం వరకు పడిగాపులు పడ్డారు. తిండితిప్పలు లేకుండా జిల్లా పరిషత్ ఆవరణలో గట్లు మీద, ఖాళీ ప్రాంతాల్లో నిరీక్షించారు. కౌన్సెలింగ్‌కు ఎప్పుడు పిలుస్తారా అని ఎదురుచూశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 442 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఇందులో 95 శాతం మంది ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారు ఉన్నారు. పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉదయాన్నే కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకోగా సాయంత్రం వరకు పిలవలేదు. అసలు ఏమి జరుగుతుందో తెలియక ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆందోళన చెందారు. కూటమి ప్రజాప్రతినిధులు సిఫార్సు లేఖలు పెద్ద సంఖ్యలో రావడంతో పంచాయతీరాజ్ ఎస్‌ఈ కె.శ్రీనివాసరావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు తర్జనభర్జన పడినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు అడిగిన పోస్టింగ్‌లు, ఇతర వ్యవహారాల వల్ల కౌన్సెలింగ్ జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. ఖాళీల జాబితా చివరి నిమిషం వరకు బయట పెట్టకపోవడంపై ఆందోళన వ్యక్తమైంది. కాగా సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ రాత్రి వరకు కొనసాగింది. తొలుత దివ్యాంగులు, స్పౌజ్, అనారోగ్య పీడితులకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఆ తర్వాత కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకు బదిలీలు నిర్వహించారన్న ఆరోపణలు వచ్చాయి.




బదిలీల కోసం వచ్చిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

**కార్యదర్శుల కౌన్సెలింగ్‌లో గందరగోళం**

**దాబాగార్డెన్స్:** జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన వార్డు సంక్షేమ కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా మారింది. జీవీఎంసీ పరిధిలో 473 మంది కార్యదర్శులున్నారు. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నవారిని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా యూసీడీ పథకం సంచాకులు పి.ఎం.సత్యవేణి ఆధ్వర్యంలో కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ ఆదివారం నిర్వహించారు. ప్రతి కార్యదర్శి మూడు ఆప్షన్లు ఇస్తే.. అందులో ఒకటి ఎంపిక చేసి పోస్టింగ్ ఇస్తామని అధికారులు తెలిపారు. ఒకే ఆప్షన్ ఇస్తే కౌన్సెలింగ్ ప్రక్రియ సులభతరమవుతుందని కార్యదర్శులు అడగడంతో అధికారులు ససేమిరా అన్నారు. కార్యదర్శులు పట్టువిడవలేదు. దీంతో అధికారులు, కార్యదర్శుల మధ్య గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సు లేఖలు తీసుకువచ్చిన వారికి అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని కార్యదర్శులు ఆరోపిస్తున్నారు.

## సర్వేయర్ల ఆందోళన

బదిలీల్లో సిఫార్సులకు పెద్దపీట వేశారని ఆవేదన



సర్వే డిపార్టుమెంట్ ఎదుట వేచి ఉన్న సర్వేయర్లు

**మహారాణిపేట :** సచివాలయ సర్వేయర్లు గ్రేడ్–2 బదిలీల్లోనూ కూటమి ఎమ్మెల్యేల సిఫార్సులకు పెద్దపీట వేశారంటూ సర్వేయర్లు ఆందోళనకుదిగారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సర్వే డిపార్టుమెంటులో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ఆదివారం బదిలీ కౌన్సెలింగ్ చేపట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 354 మంది బదిలీ కౌన్సెలింగ్ కోసం వచ్చారు. సర్వే అసిస్టెంట్ డైరెక్టర్లు సూర్యారావు(విశాఖ),గోపాలరావు(అనకాపల్లి) బదిలీ కౌన్సెలింగ్ చేపట్టారు. బదిలీల్లో పైరవీలకు పెద్దపీట వేస్తున్నారని, సిఫార్సుల వల్ల తాము నష్టపోతున్నామని, జాబితాప్రకారం బదిలీలు చేయడం లేదని సర్వేయర్లు ఆందోళనకుదిగారు. కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సులేఖల వల్ల నిజాయితీపరులకు అన్యాయంజరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## కళకళలాడుతున్న జలాశయాలు




**మాడుగుల:** ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి మండలంలో అధిక జలవనరులు గల పెద్దేరు జలాశయం నిండుకుండలా మారింది. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.40 మీటర్లకు చేరుకోవడంతో జలాశయ అధికారులు ఒక గేటు ద్వారా 150 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోకి 150 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. పెద్దేరు జలాశయం ఆయకట్టు 15వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో రైతులు వరి సాగు చేయనున్నారు. నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో దమ్ము పట్టి, మడులు సిద్ధం చేస్తున్నారు.

**పెరుగుతున్న తాండవనీటి మట్టం**

**నాతవరం:** తాండవ రిజర్వాయర్‌లో నీటి మట్టం క్రమేపి పెరుగుతోంది. తాండవ ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రానికి 367.1 అడుగులకు నీటి మట్టం చేరింది. తాండవ రిజర్వాయర్ ప్రమాదస్థాయి నీటి మట్టం 380 అడుగులు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు తాండవ రిజర్వాయర్ నుంచి ఆగస్టు నెలలో నీటిని విడుదల చేయడం ఆనవాయితీ. నీటి విడుదలకు ఇంకా నెల రోజులకు పైగా సమయం ఉండడంతో ఈలోపు వర్షాలు కురిసి ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతుందని ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు. తాండవ ఆయకట్టు పరిధిలోని రైతులంతా ఖరీఫ్‌లో వరినాట్లు వేసేందుకు వరినారుమడులు సిద్ధం చేసుకోవాలన్నారు. శివారు ఆయకట్టుకు సైతం నీటిని సరఫరా చేసేందుకు కాలువలో పూడిక తీత పనులు చేస్తున్నామని జేఈ చెప్పారు.

## క్లుప్తంగా

### జలపాతంలో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి



మృతి చెందిన తేజ

మాడుగుల రూరల్ : మండలంలో తాటిపర్తి శివారు బిళ్లలపాలెం మినీ జలపాతంలో స్నానానికి దిగిన వ్యక్తి ఊబిలో చిక్కుకుని మృతి చెందిన విషాద సంఘటన తెలియవచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మాడుగులలో జరిగిన ఒక శుభకార్యానికి విశాఖపట్నంనకు చెందిన ఐదుగురు మిత్రులు వచ్చారు. వీరు మాడుగులలో కార్యక్రమం ముగించుకుని, తిరిగి అరకు వెళ్తూ మార్గమధ్యంలో ఆదివారం సాయంత్రం తాటిపర్తి శివారు బిళ్లలపాలెం వద్ద గల మినీ జలపాతంలో స్నానానికి దిగారు. వీరిలో విశాఖపట్నం అక్కిరెడ్డిపాలేనికి చెందిన ఆర్.కె.తేజ (33) అనే వ్యక్తి ఊబిలో చిక్కుకుని పోవడంతో మిగిలిన మిత్రులు స్థానికుల సాయంతో బయటకు తీసి, మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్కడ తేజ మృతి చెందాడు. స్నానానికి దిగిన మాధవధారకు చెందిన మరో వ్యక్తి కౌసల్ ఊబిలో చిక్కుకోవడంతో అతనిని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందించారు. అనంతరం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి మెరుగుపడిందని స్థానిక పోలీసులు తెలిపారు. తేజ మృతదేహాన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### జనసేన నేత ఫ్లెక్సీ చించివేత



చించివేతకు గురైన జనసేన మండల అధ్యక్షుడు పరశురామ్ ఫొటోతో కూడిన ఫ్లెక్సీ

మునగపాక: మొన్న బీజేపీ–టీడీపీ, నిన్న టీడీపీలో గ్రూపుల గోల..కాగా నేడు జనసేనలోనూ వర్గపోరు బయటపడింది. నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో మండల స్థాయిలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడంతో వివాదం ముదురుతూ వస్తుంది. తాజాగా జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ జన్మదినం సందర్భంగా స్థానిక బైపాస్ రోడ్డులో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో కొంతమంది ఫొటోలు ప్రొటోకాల్‌కు విరుద్ధంగా ఉన్నాయంటూ ప్రచారం జరగడంతో పాటు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సంబంధిత ఫ్లెక్సీని చించివేశారు. విషయం తెలుసుకున్న జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ ఈ విషయమై మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### ఆకట్టుకున్న చతుర్గుణిత అష్టావధానం

మద్దిలపాలెం: చతుర్గుణిత అష్టావధానం ప్రక్రియ డాక్టర్ బులుసు అపర్ణ ఆధ్వర్యంలో సాహిత్య శ్రావ్యనందకరంగా జరిగింది. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు పేరాల బాలకృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యద్భుతంగా సాగింది. నిషిద్ధాక్షరి, సమస్య దత్తపది, వర్ణన, ఆశువు, వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి, వారగణనం, అనువాదం, పురాణం అనే అంశాలపై 32 మంది పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ బులుసు అపర్ణ అసాధారణ రీతిలో.. ఏకధాటిగా పద్యరూపంలో పూరణ చేసి సభికులను రంజింపజేశారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, శ్రీ విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు పేరాల బాలకృష్ణ, కార్యదర్శి సీతారాం ప్రభుతో కలిసి డాక్టర్ బులుసు వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలనతో అవధాన ప్రక్రియను ప్రారంభించారు.



వడ్డాది జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న గొయ్యి



విజయరామరాజుపేట వద్ద ఏర్పడ్డ గోతుల్లో నుంచి వెళ్తున్న వాహనాలు



బురదలో కూరుకుపోయిన వాహనాలను ట్రాక్టర్లతో లాగుతున్న డ్రైవర్లు



బీఎన్ రోడ్డులో కూరుకుపోయిన ఆటోను తోస్తున్న ప్రయాణికులు

# బాసలు చేశారు... బాటలు మరిచారు!

- అధ్వానంగా బీఎన్ రోడ్డు
- చెరువులను తలపిస్తున్న గోతులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని కూటమి పాలకులు
- బురదలో కూరుకుపోతున్న వాహనాలు



కొత్తూరు వద్ద రోడ్డు పాడవడంతో పక్క నుంచి వెళ్తున్న వాహనదారులు



శింగవరం వద్ద బీఎన్ రోడ్డు దుస్థితి

బుచ్చెయ్యపేట : ఎన్నికల్లో గెలిస్తే ముందుగా భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డు బాగు చేస్తామన్న కూటమి నేతల మాటలు కోటలు దాటాయి. శిథిలావస్థకు చేరిన రోడ్డును బాగు చేయడం దేవుడెరుగు కనీసం గోతులను పూడ్చి రవాణా సదుపాయం కల్పించడానికి కూటమి నేతలు చేతులెత్తేశారు. గత ప్రభుత్వం రోడ్లను బాగు చేయడంలో విఫలమైందని, తాము అధికారంలోకి వస్తే రోడ్లు బాగు చేసేస్తామన్న కూటమి నేతలు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, ఎంపీ రమేష్ ఇపుడు బీఎన్ రోడ్డు వైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. వడ్డాది, శింగవరం, విజయరామరాజుపేట, ఎల్‌బీ పురం, బంగారుమెట్ట, లక్ష్మీపురం పొలాలు వద్ద, మేడివాడ, గర్నికం, రోలుగుంట, గోవాడ తదితర ప్రాంతాల వద్ద పెద్దపెద్ద గోతులు పడ్డాయి. గోతుల్లో వర్షం నీరు చేరి తారు రోడ్డు బురద మట్టి రోడ్డులా తయారైంది. పలు గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఐదు అడుగుల లోతు వరకు రోడ్డు మధ్యలో గోతులు పడడంతో ప్రతి రోజు ఆటోలు, వ్యాన్లు, లారీలు బురదలో కూరుకుపోతున్నాయి. బురదలో కూరుకుపోతున్న వాహనాలను పొక్లెయిన్లు, ట్రాక్టర్లకు తాడు కట్టి బయటకు లాగుతున్నారు. ఆస్పత్రులకు వెళ్లే గర్భిణులు, బాలింతలు బీఎన్ రోడ్డులో ప్రయాణానికి నరకయాతన పడుతున్నారు. ఆటోలు ఇతర వాహనదారులు ఈ రోడ్డులో ప్రయాణించి బేరింగ్‌లు పోయి వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆయా వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ప్రయాణానికి నరకంగా మారిన బీఎన్ రోడ్డును బాగు చేయాలని ఇటీవల వడ్డాది గోతుల్లో వలలు వేసి చేపలు పడుతూ పలువురు నిరసన తెలిపారు. అయినా కూటమి నేతలు, అధికారుల్లో మాత్రం చలనం లేదు. ఇప్పటికైనా కూటమి నేతలు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి బీఎన్ రోడ్డు బాగు గురించి చర్యలు చేపట్టాలని, సుఖ ప్రయాణం కల్పించాలని చోడవరం నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

## వైభవం.. వరదపాయస సేవ

- వైకుంఠవాసుడికి విశేషంగా అభిషేకాలు
- విరాట్‌పర్వ పారాయణం, పాయసం నివేదన



పొర్లుబండపై నుంచి పాయసాన్ని జారవిడుస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై వైకుంఠవాసుడి సన్నిధిలో ఆదివారం వరదపాయసం సేవ విశేషంగా నిర్వహించారు. దేశంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఏటా సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్టపై కొలువుదీరిన వైకుంఠవాసుడి సన్నిధిలో పాయసం వండి, సమీపంలో ఉన్న పొర్లు బండపై నుంచి జారవిడవడం ఆచారంగా వస్తోంది. దీనినే వరదపాయసం సేవగా పేర్కొంటారు. అప్పన్న ఆలయ అర్చకులు ఉదయం 8 నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువుదీరిన వైకుంఠవాసుడి సన్నిధిలో విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం, పంచకలశ ఆవాహనం, పంచకలశ స్నపనం, విశేష ఆరాధన ఘనంగా జరిపారు. విరాట్‌పర్వ పారాయణం చేశారు. అనంతరం అక్కడే వండిన పాయసాన్ని స్వామికి నివేదించి, సమీపంలో ఉన్న పొర్లు బండపై జారవిడిచారు. భక్తులు పొర్లు బండపై నుంచి జారే పాయసాన్ని ప్రసాదంగా స్వీకరించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు, వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవలందించడంలో రెవెన్యూశాఖ కీలకం

- కలెక్టర్ విజయకృష్ణన్
- వీఆర్వోల సంఘ భవనానికి శంకుస్థాపన



ఏపీ రెవెన్యూ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లను సత్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్: ప్రజలతో నిత్యం మమేకమై రెవెన్యూ సేవలందించే వీఆర్వోలకు ఐక్య వేదిక ఒకటి ఉండడం ఎంతో అవసరమని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన వీఆర్వోల సంఘం నూతన బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి లక్ష రూపాయలు సొంత నిధులను ఇస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా చేయడంలో రెవెన్యూ శాఖ పాత్ర అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఈర్లె శ్రీరామమూర్తి, ఏపీ రెవెన్యూ సంఘం అధ్యక్షుడు బి. వెంకటేశ్వరావును శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.ఆయేషా, సంఘం నాయకులు ఎస్.టి.రామదాసు, ఎ.శశి, సిహెచ్ ఇరుకునాయుడు పాల్గొన్నారు.

## కొడుకును చూసేందుకు వెళ్తూ.. అనంత లోకాలకు..

- లారీ ఢీకొని ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న తల్లి మృతి
- స్వల్ప గాయాలతో బయటపడ్డ తండ్రి



మృతురాలు విజయలక్ష్మి(ఫైల్)



ప్రమాద స్థలిలో విజయలక్ష్మి మృతదేహం

సబ్బవరం: ఓ ప్రైవేట్ స్కూల్ హాస్టల్లో ఉండి చదువుకుంటున్న కుమారుడిని చూసేందుకు వెళ్తున్న తల్లిదండ్రులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో తల్లి అక్కడికక్కడే మరణించగా, తండ్రి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై చిన్నయ్యపాలెం జంక్షన్ దరి బ్రిడ్జి వద్ద ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. స్థానిక సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కశింకోట మండలంలోని తీడ గ్రామానికి చెందిన దుంగల విజయలక్ష్మి తన భర్త శ్రీనివాసరావుతో కలిసి తగరపువలసలోని ఓ ప్రైవేట్ స్కూల్లో చదువుతున్న కుమారుడి వద్దకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. హైవేపై వస్తున్న వీరు సబ్బవరంలోని చిన్నయ్యపాలెం సమీపంలోకి వచ్చే సరికి అదే మార్గంలో మిర్యాలగూడ నుంచి ఒడిశా వెళ్తున్న ఓ లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న విజయలక్ష్మి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందగా, భర్త స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

## అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్, చిత్రంలో ధర్మశ్రీ, హైమావతి, మిలట్రీనాయుడు



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

చోడవరం: పార్టీలో అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని చోడవరం సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక లక్ష్మమ్మ ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామ కల్యాణమండపంలో చోడవరం మండల కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. పట్టణం, మండలం నలుమూల నుంచి వందలాది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరుకావడంతో పార్టీ కేడర్‌లో నూతనుత్తేజం వచ్చింది. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో దౌర్జన్యాలు పెచ్చుమీరిపోయాయన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులపై కూడా కూటమి నాయకులు దౌర్జన్యాలకు దిగడం ప్రభుత్వ రాక్షసిపాలనకు అద్దం పడుతోందని చెప్పారు. వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను స్థానిక ఎమ్మెల్యే మానసికంగా వేధించారని తెలిపారు. ఇటువంటి దౌర్జన్యాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఉందన్నారు. వచ్చే నెల 8వతేదీన వైఎస్సార్ జయంతిని అన్ని గ్రామాల్లో ఘనంగా జరపాలన్నారు. అదేవిధంగా త్వరలో నిర్వహించే ఇంటింటికీ వెళ్లి కూటమి ఏడాదిపాలనలో వైఫల్యాలను తెలియజేసే కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్తలు అంకితభావంతో నిర్వహించాలన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నిత్యం ప్రజలను మోసం చేస్తూనేఉన్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలను, ప్రభుత్వ అధికారులను, ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టేందుకు బాబు షూరిటీ..మోసం గ్యారంటీ అనే నినాదంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింటికి వెళ్లే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. చోడవరం నియోజకవర్గంలో కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలపై ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే, పార్లమెంటు పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ చంద్రబాబు మోసాలపై ప్రజలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వివరించాలన్నారు. అనంతరం నాయకులను పార్టీ కార్యకర్తలు పూలదండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మిలట్రీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీలు మారిశెట్టి విజయశ్రీకాంత్, దొండా రాంబాబు, ఎంపీపీ గాడి కాసుఅప్పారావు, పంచాయతీ ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, మండల, పట్టణ అధ్యక్షులు దొడ్డి వెంకట్రావు, దేవరల్లి సత్య, జిల్లా యూత్, రైతు విభాగాల అధ్యక్షులు పుల్లేటి వెంకటేష్, బొడ్డేడ సూర్యానారాయణ, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గ శ్యామల, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణ ప్రతినిధులు పందిరి శ్రీనువాసరావు, గూనూరు రాజు, చవితిన బాబూరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా నర్సింగరావు, పీఏసీఎస్ అధ్యక్షులు శానాపతి సత్యారావు, దన్నిన వెంకట్రావు, పుత్రేవు శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు నగదు, మెమెంటోలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి : కష్టపడి చదువుకోవడం కంటే ఇష్టపడి చదువుడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ రహదారి సత్యగ్రాండ్ ఫంక్షన్ హాల్లో జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది యాదవ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో స్కాలర్‌షిప్స్ ఇవ్వడం విద్యార్థుల ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఇంటర్‌లో 992 మార్కులతో మొదటి స్థానం సాధించిన రందాసు శ్రీజకు రూ. 5000, మెమెంటో, 985 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన చందక రోస్నకు రూ.2500, మెమెంటో, పదోతరగతిలో 594 మార్కులతో మొదటి స్థానం సాధించిన బాలబోయిన బాలాజీకి రూ.5000 మెమెంటో, 592 మార్కులతో ద్వితీయస్థానం సాధించిన పల్లా అనుష్కకు రూ.2500, మెమెంటోతో పాటు, మరో 200 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు, కాలేజీ బ్యాగ్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరణికాన సాయినాథరావు (బాబురావు ), ఉమ్మడి విశాఖ జిల్లా డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు భరణికాన రామారావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## సాహితీవేత్త సత్యప్రియ మాస్టారు మృతి తీరని లోటు

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సాహితీవేత్త బీలా సత్యప్రియ (ఫైల్)

దేవరాపల్లి: మండలంలోని వేచలం గ్రామానికి చెందిన సాహితీవేత్త, రిటైర్డ్ టీచర్ బీలా సత్యప్రియ మాస్టారు మృతి ఈ ప్రాంతానికి తీరని లోటు అని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. వేచలంలో శనివారం రాత్రి సత్యప్రియ మాస్టారు మృతిచెందారు. ఆదివారం వేచలంలో అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా సత్యప్రియ మాస్టారు భౌతికకాయానికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చిరికి శ్రీనువాసరావు, నొడు అప్పారావు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, రాజకీయ పార్టీ నాయకులు నివాళులర్పించారు. పలువురు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర రంగాల ప్రముఖులకు సత్యప్రియ మాస్టారు ప్రశంసా పత్రాలు, కవిత్వాలు రాసి ఈ ప్రాంత కవిగా ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడిగా కూడా సత్యప్రియ మాస్టారు పనిచేశారు.

## రైలునుంచి జారిపడిన యువకులు

గోపాలపట్నం: ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ నుంచి ఇద్దరు యువకులు జారిపడగా, వారిలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సింహాచలం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో పవిత్రా దాస్, సగ్రామ్ దాస్ ప్రయాణిస్తున్నారు. సింహాచలం రైల్వేస్టేషన్‌లో ఈ రైలుకు హాల్ట్ లేదు. అయితే రైలు స్టేషన్‌లో నెమ్మదిగా వెళ్తున్న సమయంలో వారు ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. అక్కడే ఉన్న ఆర్పీఎఫ్ సిబ్బంది గమనించి వారిని కాపాడారు.

## ప్రిన్సిపాల్‌ని ఆస్పత్రి పాలు చేసిన నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

బుచ్చెయ్యపేట : వడ్డాది కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఆస్పత్రి పాలు చేసిన కూటమి నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి. వెంకన్న డిమాండ్ చేశారు. గుడి లాంటి పాఠశాలలో పాఠాలు బోధించే ఒక మహిళా ప్రిన్సిపాల్ పట్ల అనుచితంగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఎమ్మెల్యే ఆఫీసుకి పిలిపించి కూటమి నేతలు దుర్భాషలాడి ఆమెకు గుండెపోటు తెప్పించిన వారందరిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీలో ఆన్‌లైన్ ద్వారా సీట్లు కేటాయింపు జరగ్గా నాయకులు, ఉపాధ్యాయులు సీట్ల కోసం రాజకీయాలు చేయడం తగదన్నారు. ఉద్యోగుల బదిలీల నుంచి పసిపిల్లల సీట్ల పంపిణీలో కూడా రాజకీయ నాయకులు రాజకీయం చేయడం దుర్మార్గం అన్నారు. విద్యావిధానంలో రాజకీయ నాయకుల జోక్యం వల్ల సాధారణ ప్రజల పిల్లలు చదువులకు దూరమవుతున్నారన్నారు. కూటమి నేతల ఆరాచకాలు, బెదిరింపులు వల్ల పలువురు ఉద్యోగులు దీర్ఘకాలిక సెలవులు పెట్టి వెళ్లిపోతున్నారన్నారు. ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు తీరువల్ల ఆస్పత్రి పాలైన ప్రిన్సిపాల్ అన్నపూర్ణకు ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలన్నారు. 10 రోజుల కిందట బుచ్చెయ్యపేట ఎంపీడీవో విజయలక్ష్మి అకాల మృతికి టీడీపీ నాయకుడే ప్రధాన కారణమన్నారు. ప్రభుత్వం మహిళా ఉద్యోగుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రిన్సిపాల్‌ను బెదిరించి ఆమెకు గుండెపోటు వచ్చేలా చేసిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వెంకన్న ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

## వీఆర్‌ఎస్‌పై అయోమయం

- ముందుకురాని స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు
- ఇప్పటివరకు కేవలం 850 దరఖాస్తులు



స్టీల్‌ప్లాంట్ ముఖ చిత్రం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం రెండో విడత ప్రకటించిన వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్‌ఎస్) దరఖాస్తు విషయంలో ఉద్యోగుల్లో అయోమయం నెలకొంది. మూడో బ్లాస్ట్‌ఫర్నేస్ ప్రారంభించినందున ప్లాంట్ పరిస్థితులు బాగుపడే అవకాశం ఉందని ఉద్యోగులు ఒకవైపు ఆశావాహంగా ఆలోచిస్తుండగా.. రానున్న రోజుల్లో మరింత పని ఒత్తిడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటుందన్న భయం మరోవైపు వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ వీఆర్‌ఎస్ పట్ల ఉద్యోగులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, ఆర్థిక సదుపాయాల కోత వంటి కారణాల వల్ల ఈ ఏడాది మార్చి నెలలో వచ్చిన మొదటి వీఆర్‌ఎస్‌కు స్పందన లభించింది. అప్పట్లో కూడా వీఆర్‌ఎస్ పరిహారం, పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ శాలరీ మొత్తం ఇస్తారా... లేదా అనే సందేహాలతో 1,613 మంది మాత్రమే దరఖాస్తు చేస్తున్నారు. యాజమాన్యం వారికి సకాలంలో అన్నీ చెల్లించడంతో అప్పుడు దరఖాస్తు చేయనివారు తప్పు చేశామన్న భావన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కాలంలో పెరిగిన పని ఒత్తిడి, పూర్తి జీతాలు ఇప్పటికీ చెల్లించకపోవడం వంటి కారణాల వల్ల ఈసారి వీఆర్‌ఎస్ వస్తే కనీసం మూడు వేల మంది దరఖాస్తు చేస్తారని అందరూ ఊహించారు. అయితే అంత స్పందన లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత బడ్జెట్‌లో మిగిలిన సొమ్ము మేరకు మాత్రమే ఈసారి వీఆర్‌ఎస్ ఇస్తారని, ఊహాగానాలు వినిపించడం, ఇప్పటికే సిబ్బంది బాగా తగ్గిన నేపథ్యంలో చాలా విభాగాల్లో విభాగాధిపతులు వచ్చిన దరఖాస్తులను అంగీకరించేది లేదని చెబుతుండడంతో చాలా మంది డీలా పడి దరఖాస్తు చేయనట్టు తెలుస్తుంది. దీంతో ఇప్పటివరకు 850 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తెలుస్తుంది. అయితే జూలై 15 వరకు గడువు ఉన్నందున చివరలో ఎక్కువ దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని మరో వాదన వినిపిస్తున్నది.

## క్లుప్తంగా

### ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న కెమిస్ట్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు

**అనకాపల్లి టౌన్:** పట్టణంలోని వేల్పులవీధి కాశీ విశ్వేశ్వరుని ఆలయం పక్కన పట్టణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, టోరెంట్ ఫార్మాస్యూటికల్స్‌ల సంయుక్త నిర్వహణలో ఉచిత ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్షలు శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సులో డాక్టర్ గుండా సుధీర్ మాట్లాడుతూ మారిన జీవన పరిస్థితులు, ఆహారపు అలవాట్లతో చాలా మందిలో ఎముకల పటుత్వం తగ్గుతుందన్నారు. మనం తీసుకునే తాగునీరు, బియ్యం తదితర ఆహార ఉత్పత్తుల్లోనూ తగిన కాల్షియం ఉండడం లేదన్నారు. 50 ఏళ్ల దాటిన వారంతా ఏటా ఒకసారి పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమన్నారు. ముందుగా వ్యాధిని గుర్తిస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవడం సులభం అవుతుందన్నారు. కార్యక్రమంలో కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంకాయల ఈశ్వరరావు, ఎస్ఎస్ ప్రకాష్ గుప్తా, కోశాధికారి వై సతీష్‌కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ గుండా రమేష్ గుప్తా, కో–చైర్మన్ నుదురుపాటి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్టీయూ కృషి



గోపినాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

**అనకాపల్లి:** ఉపాధ్యాయుల సమస్యలపై నిత్యం పీఆర్టీయూ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ తెలిపారు. ఆదివారం స్థానిక వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు, నూతన ప్రభుత్వంలో నిరుద్యోగులకు డీఎస్సీ మోడల్ టెస్టులు, ప్రత్యేక శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గోపినాథ్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విశ్వేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అంధకారంలో టిడ్కో కాలనీ



చీకట్లో టిడ్కో కాలనీ

**యలమంచిలి రూరల్:** పట్టణానికి సమీపంలో టిడ్కో కాలనీలో ఆదివారం రాత్రి 1.30 గంటల నుంచి తెల్లవారుజామున 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక్కడ 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారంతా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. పలువురు విద్యుత్ శాఖ కాల్ సెంటర్, స్థానిక సిబ్బందికి ఫోన్లు చేసినా సరఫరా వెంటనే పునరుద్ధరించలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ఇక్కడ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా | : భైరవం |
| సత్యనారాయణ స్క్రీన్-1 | : కన్నప్ప |
| సత్యనారాయణ స్క్రీన్-2 | :8 వసంతాలు |
| పర్తిసాయి | :కుబేర |
| షిర్డీసాయి | : సితారే జమీన్ పర్ |
| వెంకటేశ్వర | :చంద్రేశ్వర |
| శ్రీ సత్య | : కట్టప్ప జడ్జిమెంట్ |
| రామచంద్ర | : మార్గన్ |

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 15 యూనిట్లు, బీ పాజిటివ్ -13, ఓ పాజిటివ్ -34, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్( 9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 201 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

# యూరియా.. ఏదయా

- కశింకోట మండలంలో అరకొరగా నిల్వలు
- ఎకరాకు బస్తా మాత్రమే సరఫరా
- రైతుల ఆందోళన



కశింకోటలోని ప్రైవేటు డీలర్ వద్ద అరకొరగా యూరియా బస్తాలు



లారీ నుంచి దింపుతున్న కాంప్లెక్స్ ఎరువు



సమృద్ధిగా పోటాష్ ఎరువు నిల్వలు

**కశింకోట:** మండలంలోని రైతులు సాగుకు వినియోగించే యూరియా ఎరువు అరకొరగా సరఫరా చేస్తున్నారు. దాంతో సరిపడా ఎరువు లేకుండా పంటలను ఎలా సాగు చేస్తామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో ఇంకా అందుబాటులో ఉంచలేదు. మండలంలోని ఇద్దరు ప్రైవేటు ఎరువుల డీలర్ల వద్దే యూరియా, ఇతర ఎరువులను విక్రయిస్తున్నారు. రెండు వారాలుగా వారికి యూరియా సరఫరా లేదు. దీంతో తమ వద్ద అరకొర నిల్వల విక్రయంతో నెట్టుకొస్తున్నారు. దీంతో ఎకరాకు ఒక బస్తా మాత్రమే యూరియా అందిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే ఇది ఏ మూలకు సరిపోదని, ఈ ఏడాది ఇక పంటలు పండించినట్లేనని నిట్టూరుస్తున్నారు.

మండలంలోని అత్యధిక శాతం మంది ప్రజలకు వ్యవసాయం, పశు పోషణ జీవనాధారం. ప్రధానంగా చెరకు, వరి పంటలను పండిస్తారు. దీనిలో వరి పంట అత్యధిక విస్తీర్ణంలో సాగవుతోంది. గత ఏడాది ఖరీఫ్ వరి 2,230 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక చెరకు పంట ఉడుపు, కార్శీ తోటలు కలిపి దాదాపు 455 ఎకరాల్లో ప్రస్తుతం సాగవుతోంది. వీటి సాగుకు ఎక్కువగా యూరియా ఎరువు వినియోగిస్తారు. దాని తర్వాత డీఏపీ, పోటాష్, గ్రోమోర్ తదితర కాంప్లెక్స్ ఎరువులు వాడుతారు. కాంప్లెక్స్ ఎరువులు బస్తా రూ.1300 పైగా ఉండటం వల్ల వీటిని తక్కువ మోతాదులో వినియోగిస్తారు. అయితే యూరియా ధర అతి తక్కువగా రూ.266 కావడం, దీన్ని పంటలకు వేయడం వల్ల ఎదుగుదల, పంట ఆకు పచ్చగా పెరగడంతో యూరియా పట్ల రైతులు ఎక్కువగా మక్కువ చూపుతారు. ఎకరాకు యూరియా వరికి అయితే మూడు విడతల్లో 75 కిలోలు, చెరకుకు అయితే దాదాపు వంద కిలోలు వంతున వేయాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అయితే అంతకు మించి పంటల ఎదుగుదల పరిస్థితిని అనుసరించి రైతులు దీన్ని ఎక్కువగా వినియోగిస్తుంటారు.

**పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల్లో కనిపించని యూరియా..**

ప్రస్తుతం మండలంలోని రైతులకు కశింకోట, తాళ్లపాలెంలో ప్రైవేటు డీలర్ల ద్వారా యూరియా, ఇతర ఎరువులను అందిస్తున్నారు. కొందరు స్థానిక రైతులే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి బంధువుల కోసం ఎరువులను ఇక్కడి నుంచి తీసుకెళ్తున్నారని, దీనివల్ల యూరియా నిల్వలు తరిగిపోతున్నాయని డీలర్లు అంటున్నారు. అంతేకాక రెండు వారాలుగా యూరియా సరఫరా కావడం లేదని, ఇతర కాంప్లెక్స్ ఎరువులు మాత్రం వస్తున్నాయంటున్నారు. దీనివల్ల నిల్వలు తగ్గిపోవడంతో పరిమితంగా యూరియా అందిస్తున్నామంటున్నారు. మండలంలో రెండు పీఏసీఎస్‌లు, 18 రైతు సేవా కేంద్రాలున్నాయి. వాటిలో ఇంకా యూరియా ఎరువు విక్రయానికి అందుబాటులో ఉంచలేదు. వీటికి కూడా యూరియా సరఫరా చేసి విక్రయాలు చేపడితే కొరత తీరగలదని రైతులంటున్నారు. ఇందుకు అధికారులు చర్యలు తీసుకొని సరిపడినంత మేర యూరియా అందించాలని కోరుతున్నారు.

**పశుగ్రాసం కోసం యూరియా వాడకం..**

పైగా ఎక్కువ మంది పాడి పశువుల పోషణ నిర్వహిస్తారు. వీటికి పశుగ్రాసం ఎక్కువ అవసరం ఉంటుంది. దీన్ని చిన్న మడుల్లో సాగు చేస్తుంటారు. దీని ఎదుగుదలకు కూడా యూరియా ఎరువు ఎక్కువగా వాడతారు. ఎకరాకు పది కిలోలు వేస్తే సరిపోతుందని అధికారులంటున్నారు. అయితే ఎదిగిన గడ్డి కోసి మళ్లీ ఎదగడానికి దఫదఫాలుగా ఇది బస్తాల కొద్దీ వేసుంటారంటున్నారు. ప్రస్తుతం ఇంకా ఖరీఫ్ వరి పంట సాగు చేపట్టలేని, ఇది చేపట్టకుండా యూరియా అవసరం ఎక్కువగా ఉండదంటున్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న యూరియాను సాగును అనుసరించి అంచనా వేసి నిబంధనలను అనుసరించి సరిపడిన మేరకు సరఫరా చేస్తుందంటున్నారు. అదనంగా పది శాతం మేర అందించడానికి అవకాశం ఉంటుందని, అంతకు మించి సరఫరా చేయదంటున్నారు.

**బస్తాకు మించి ఇవ్వడం లేదు**



యూరియా బస్తాకు మించి ఇవ్వడం లేదు. పరిమితంగా ప్రైవేటు డీలర్ ద్వారా విక్రయిస్తున్నారు. దీనివల్ల చెరకు పంటకు యూరియా సరిపోవడం లేదు. ఇలా అయితే ఎదుగుదల లేక పంట నష్టపోవలసి వస్తుంది. దీనిదృష్ట్యా యూరియా ఎరువును సమృద్ధిగా అందివ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బుద్ధ నాగేశ్వరరావు, రైతు, కశింకోట.

**అవసరం ఉంటే అందివ్వడానికి చర్యలు**

రైతులు సాగు విస్తీర్ణం అనుసరించి అదనంగా యూరియా అవసరం ఉంటే నిబంధనలకు లోబడి అందివ్వడానికి చర్యలు తీసుకుంటాం. మండలంలో ఇంకా ఖరీఫ్ వరి సాగు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం రైతులు పశుగ్రాసం పెంపునకు మోతాదుకు మించి యూరియా వినియోగిస్తున్నారు. ఎకరాకు పది కిలోలు మించి వాడరాదు. ఆ మేరకే ప్రభుత్వం నుంచి యూరియా సరఫరా చేస్తున్నారు. అంతకు మించి దఫ దఫాలుగా గడ్డి ఎదగడానికి వాడటానికి బస్తాలు వంతున ఎరువు సరఫరా చేసే అవకాశం లేదు. వరి, చెరకు సాగుకు కొరత రాకుండా యూరియాను పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఇద్దరు ప్రైవేటు డీలర్ల దుకాణాల ద్వారా యూరియాను ఎకరాకు రైతుకు రెండు బస్తాలు రెండు దఫాలుగా అందిస్తున్నాం. భూమి ఆరోగ్యవంతంగా ఉండటానికి రైతులు మోతాదుకు మించి యూరియా వినియోగించరాదు.

–ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

## వారాహిదేవిగా కనకదుర్గ అమ్మవారు



వారాహిదేవిగా గవరపాలెం కనకదుర్గ దర్శనం



వారాహిదేవిని దర్శించుకున్న భక్తులు

**అనకాపల్లి:** అష్టమి వార్షికోత్సవం సందర్భంగా స్థానిక గవరపాలెంలో శతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు వారాహిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు బోగాపురపు వెంకటరమణ (బాబు), ఉదయగిరి చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో ఆషాఢ మాసం శుద్ధ పంచమి పురస్కరించుకుని అమ్మవారిని వారాహి దేవిగా ఆదివారం అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



కశింకోట వద్ద ఏర్పాటు చేసిన స్టాప్ బోర్డు

**కశింకోట:** మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ఆదివారం హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహన చోదకులకు జరిమానా విధించి చర్యలు చేపడుతున్నామన్నారు. అధిక వేగంతో నడిపే వాహన చోదకులపై ప్రత్యేక దృష్టి నిలిపి వారికి జరిమానా విధించడంతోపాటు కౌన్సెలింగ్ ఇచ్చి పంపుతున్నామన్నారు. స్కూళ్లు, కళాశాలలు, గ్రామ పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కలిగిస్తున్నామన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైన్ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. రాత్రి పూట ప్రత్యేక గస్తీ బృందాలను నియమించి అనుమానిత వాహనాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణ కావాలంటే ప్రజలు సహకారం అందించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ భద్రతను కాపాడుకోవాలన్నారు.

## వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి



కశింకోటలో వరాహావతారంలో జగన్నాథస్వామి అలంకరణ

**అనకాపల్లి టౌన్:** పట్టణంలోని గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువైన సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి వరాహ అవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రాంగణంలో వెలగా ప్రవీణ, మెల్లేటి సరళ ఆధ్వర్యంలో సంకీర్తనలు, కోలాటం ప్రదర్శనలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ, శ్రీరామ్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యే పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్యనిర్వాహణాధికారి బీ మురళీకృష్ణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

**కశింకోట:** స్థానిక దేవాదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు వరాహావతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని వరాహావతారంలో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేసి భక్తుల గోత్ర నామాలతో అర్చించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రామచరణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో యాతలకు ప్రాధాన్యమివ్వాలి

**జిల్లా యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే మారేష్**



జిల్లా యాత సంక్షేమ సంఘం నాయకులు

**అనకాపల్లి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ ప్రకారం సీట్లు కేటాయించాలని జిల్లా యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే మారేష్ కోరారు. ఆదివారం స్థానిక గాంధీనగరం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో యాతలకు అవకాశం కల్పించాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అమలులో ఉన్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ రాజకీయ రంగంలో లేకపోవడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అణగారిన వర్గాల రాజకీయ ప్రయోజనాలను కాపాడే విధంగా బీసీ రిజర్వేషన్లను వర్గీకరించి అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఇతర అణగారిన బీసీ కులాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో యాత కార్పొరేషన్ పాలకవర్గాన్ని నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహించడం అన్యాయమన్నారు. యాత కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని, యాత కులస్తుల పిల్లల విద్యాభ్యాసం కోసం ప్రత్యేక హాస్టళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యాత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు, న్యాయవాది ఓడిబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఊబిలో చిక్కుకొని పాడిగేదె మృతి



**రావికమతం :** మరుపాకలోని కనుముల చెరువు ఊబిలో చిక్కుకొని పాడి గేదె మృతి చెందింది. మరుపాక పంచాయతీ శివారు దాసరయ్యపాలేనికి చెందిన గంట్ల ప్రసాద్‌కు చెందిన పాడి గేడె ఆదివారం మరుపాక గ్రామానికి చెందిన కనుముల చెరువు సమీపానికి మేతకు తీసుకెళ్లారు. గేదె మేస్తూ సమీపంలో గల కనుముల చెరువులో నీరు కోసం దిగి ఈదుకుంటూ లోపలికి వెళ్లింది. చెరువులో ఊబి ఉండడంతో దాంట్లో చిక్కుకుంది. ఊబిలో చిక్కుకున్న గేదెను రక్షించేందుకు సమీపంలో ఉన్న రైతులు ప్రయత్నించారు. చాలా సేపటి తర్వాత ఒడ్డుకు చేర్చారు. అప్పటికే గేదె మృతి చెందిందని రైతు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పాడి గేదె రూ. 60 వేలు ఖరీదు చేస్తుందని రైతు తెలిపారు.

## విస్తృతంగా కర్ర పెండలం సాగు



గుల్లేపల్లిలో సాగులో ఉన్న కర్రపెండలం పంట

**కె.కోటపాడు :** మండలంలో పలు గ్రామాల్లో కర్ర పెండలం పంటను విస్తారంగా రైతులు సాగుచేస్తున్నారు. ప్రధానంగా ఈ పంటను మెట్ట ప్రాంత గ్రామాలైన గరుగుబిల్లి, గొండుపాలెం, దాలివలస, కొరువాడ, డి.అగ్రహారం, ఆర్లి, ఎరకన్నపాలెం, పిండ్రంగి గ్రామాల్లో 100ఎకరాల్లో సాగుచేస్తున్నారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో గల భూములు ఈ పంటకు అనుకూలంగా ఉండి సాగు వల్ల కర్ర పెండలం దుంపలు దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేయనున్నట్టు రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న కర్ర పెండలం సాగు మరో 15 రోజుల్లో పంట చేతికి అందివస్తుందని సాగు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## గెడ్డవాగులో అక్రమ కల్వర్టు తొలగింపు

**సబ్బవరం:** మండలంలోని జీవీఎంసీ పరిధి వెదుళ్ల నరవలో ప్రభుత్వ భూమి గెడ్డవాగులో అక్రమంగా నిర్మించిన కల్వర్టును రెవెన్యూ సిబ్బంది యంత్రాల సాయంతో ఆదివారం తొలగించారు. వెదుళ్లనరవ రెవెన్యూ పరిధి సర్వే నెం.94లో ప్రభుత్వ భూమి గెడ్డవాగులో కల్వర్టును నిర్మించారు. తహసీల్దార్ చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గెడ్డవాగులపై కల్వర్టుల నిర్మాణానికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు తప్పనిసరన్నారు. అనుమతుల్లేకుండా అక్రమంగా కల్వర్టులు నిర్మించడం నేరమని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు కల్వర్టులు అవసరమైతే ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆక్రమణలను తొలగించినవారిలో ఆర్ఐతో పాటు వీర్వో రాంబాబు ఉన్నారు.

## రైతులకు కొబ్బరి, పండ్ల మొక్కలు పంపిణీ



దేవరాపల్లిలో పండ్ల మొక్కలను అందజేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సన్యాసిరావు

**దేవరాపల్లి:** ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు పండ్ల మొక్కలను ఆదివారం ఉచితంగా అందజేశారు. చెరువు గట్లుపైన నీటి గుంతలు వద్ద నాటేందుకు మొక్కలను సదరు రైతులకు అందజేసినట్టు ఉపాధి ఏపీవో వై. రుక్మిణీదేవి తెలిపారు. కొబ్బరి–430, సపోటా–230, మామిడి–240, వేప, బాధం, మహాగని తదితర మొక్కలు 50 చొప్పున విశాఖపట్నం పోర్టు అథారిటీ సరఫరా చేయగా, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సన్యాసిరావు తదితర సిబ్బంది అందజేశారు.

## బాడీబిల్డింగ్, ఫిట్‌నెస్‌పై యువతకు అవగాహన



వడ్డాదిలో బాడీ బిల్డింగ్ ప్రదర్శన చేస్తున్న యువకుడు



బాడీ బిల్డింగ్‌లో ప్రతిభ చూపిన యువకులకు బహుమతులు అందిస్తున్న శివశంకర్

**బుచ్చెయ్యపేట :** యువత విద్యతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని టీమ్ ఇండియా ఆర్మీ, సర్వీసెస్ కోచ్ టి.శివశంకర్ (ఇతను ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ఆర్మీ ఉద్యోగి) తెలిపారు. ఆదివారం సాయంత్రం వడ్డాదిలో ఎస్ఆర్ ఫిట్నెస్ జిమ్‌కోచ్‌లో బాడీ బిల్డింగ్, ఫిట్‌నెస్‌పై యువతకు అవగాహన కల్పించారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే జిమ్ సెంటర్‌లు పల్లె గ్రామీణ ప్రాంతంలో ఫిటెనెస్ సెంటర్ ఏర్పాటు చేసి యువత ఆరోగ్యం, ఫిటెనెస్‌కు ప్రాధాన్యం కల్పించిన జిమ్ నిర్వాహకుడు గండెం వెంకటేష్‌ను అభినందించారు. పలువురు యువకులు బాడీ బిల్డింగ్ ప్రదర్శన చేశారు. జాతీయ బాడీ బిల్డర్ ఎస్.బాబి, ఒలింపియన్ వెయిట్ లిఫ్టర్ ఎం.వి. మాణిక్యాలు తదితరులు బాడీ బిల్డింగ్ చేసే విధానం, ఆహార నియమాలు, ఆరోగ్యం గురించి యువతకు అవగాహన కల్పించారు. బాడీ బిల్డింగ్‌లో ప్రతిభ చూపిన యువతకు బహుమతులు అందించారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రోలుగుంటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

**రోలుగుంట :** వారందరూ ఆరు పదుల వయస్సు దాటిన వారే. పెడబొడ్డేపల్లి ఆర్సీఎం (రోమన్ కేథలిక్ మిషనరీ) హైస్కూల్లో 1976–77 వరకూ (పదో తరగతి) వరకూ చదువుకొని వేర్వేరు చోట్ల ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానాలు అధిరోహించి పదవీ విరమణ చేశారు. కొందరు వ్యాపారం, వివిధ జీవనోపాధిలో స్థిరపడ్డారు. సుమారు 48 సంవత్సరాలు తరువాత తిరిగి తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. వైజాగ్‌లో స్థిరపడిన పి.వి.ఆర్.మూర్తి, అబ్దుల్ ఖాదర్ తమతో అప్పట్లో చదువుకున్న నాటి మిత్రుల చిరునామాలు సేకరించి గ్రూపు ఏర్పాటు చేశారు. అందరూ కలిసి రోలుగుంటలో ఆదివారం ఆపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పచ్చని పొలాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో కలుసుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు.